# ఇది కథ కాదు



ర్యాక్కి వెళ్ళి వచ్చాడు.

నారా: ఉద్యోగం వచ్చిందా?

బం: ఇంకా రిజల్ట్ తెలియలేదు.

నారా: రెండవ వాడు ఏం చదువుతున్నాడు!

బం: టెన్త్ క్లాస్.

నారా: ఆడపిల్లలో!

బం: పెద్ద పిల్ల ఇంటర్మీడియట్ పాసయింది తక్కిన ముగ్గురూ స్కూల్లో చదువుతున్నారు. మీ పిల్లలో?

నారా: పెద్దది ఆడపిల్ల. పది వేలు డొనేషన్ కట్టి డాక్టరీ చెప్పిస్తున్నా. మగ పిల్లవాడికి ఇంజనీరింగ్ చెప్పించాలని ప్రయత్నం.

బం: ప్రయత్నం అంటున్నావు! ఫలించటం లేదా?

నారా: చదువులో వాడికి అచ్చుగా నా పోలికే వచ్చింది.

బం: నీ కేం, నారాయణరావ్! చదువు అబ్బకపోయినా సిరి సంపదలు చేకూరాయిగా. నేను ఇక వస్తాను. పనుండి వెడుతున్నాను.

నారా: మంచిది. మళ్ళీ కలుద్దాం.

బంగారయ్య:

ఈ చౌక డిపో— ఇదేమిటో ఎప్పుడూ మూసే ఉంటుంది. అథవా ఎప్పుడయినా తెరిచినా పంచదార స్టాకు లేదు అంటాడు. ఇంట్లో పంచదార అయిపోయింది అని చెప్పింది మాణిక్యం. ఖాళీ సంచీ చూసి దిగాలు పడిపోతుంది. ఓపెన్ మార్కెట్టులో ఖరీదు రెట్టింపు ఉన్నది. అంత ధర పెట్టి ఏం కొనగలం?

నారాయణరావుకు ఈ ఈతిబాధ లుండవు కదా? అదృష్టవంతుడు. లక్షల మీద వ్యాపారం చేస్తున్నాడు. గొప్ప ప్రయోజకు డయాడు.

ఆడపిల్లకు మెడిసిన్ చెప్పిస్తున్నాడట. మగ పిల్లవాడు తన అడుగు జాడల్లో నడుస్తున్నాడట. నష్ట మేముంది? వాడూ తన లాగానే కాంట్రాక్టులు చేస్తాడు. డబ్బు సంపాదిస్తాడు. చదువుకోకపోతే మాత్రమేం?

శేఖర్ కాలేజీ ఫస్ట్‌గా పాసయి రెండేళ్ళయింది. ఏదీ ఉద్యోగం?

విమలను ఇంటర్మీడియట్‌లో చదువు ఆపించి, ఇంట్లో కూర్చో బెట్టాను. దానికి బి. ఎ. చదవాలని ఎంతో ఉబలాటం.

క్లాసులోనే ఫస్ట్‌గా ఉంటున్న వాసు సరదాగా స్నేహితులతో ఎక్స్‌కర్షన్‌కి పోతానంటే పంపలేక పోతున్నాను.

బోసిగా ఉన్న మెడలోకి రాధ రోల్డ్ గోల్డ్ గొలుసు కొని పెట్టమంటే కొనలేక పోతున్నాను.

ఇక పార్వతి సరేసరి—రెండే రెండు పరికిణీలతో వేలాడుతున్నది. మూడో పరికిణీ దానికి అందని పండే.

ఆఖరి పిల్ల అరవింద వీథిబడినుంచి మధ్యాహ్నం ఇంటికి తారు రోడ్డు మీదుగా నడిచి వచ్చేసరికి కాళ్ళు బొబ్బ లెక్కి ఉంటాయి. ఒక జోడు చెప్పులు కొనలేక పోతున్నాను.

మాణిక్యం పండుగ నాడుకూడా పాత చీరతోనే ఉంటుంది!

* * *

నారాయణరావు:

రోజు రోజుకూ అబద్ధపు బతుకు అయిపోతున్నది. బంగారయ్యతో పచ్చి అబద్ధ మాడవలసి వచ్చింది. ఏమిటో అభిమానం? చిన్నప్పటి నుంచీ అతడు నీతి వాక్యాలు వల్లిస్తూ ఉండేవాడు. తను తెలివి కలవాడు కాబట్టి పరీక్షలు ఫస్ట్ క్లాసులో పాసు కాగలడు. మరి నా వంటి వాళ్ళూ! కాపీలు కొట్టవద్దనే వాడు. స్వశక్తి మీద పాసు కావాలి అనేవాడు. ఇప్పటికీ ఆ మాట మీదే ఉన్నాడు. లారీ బ్రోకరు చేస్తున్నాను అని చెప్పుకో లేకపోయాను. అభిమానం అడ్డు వచ్చింది. కాంట్రాక్టులు చేస్తున్నా నని పెద్ద అబద్ధ మాడాను.

అక్కడితో ఆగినా బాగుండేది! ఆడ పిల్లకు డాక్టరీ చెప్పిస్తున్నా నన్నాను. అడిష్టి పదివేలు డొనేషన్‌కట్టి. అంతస్తు పెరుగుతుంది అన్న దృష్టి. బంగారయ్య దృష్టిలో గొప్పవాడిగా కనిపించాలన్న ఆహం. ఆ పది వేలే ఉంటే ఆడపిల్ల పెళ్ళి చేసి అత్త వారింటికి పంపించి ఉందును.

పిల్లవాడికి ఇంజనీరింగ్ చెప్పించాలని వృథా ప్రయత్నం చేస్తున్నా నంటే, బంగారయ్య నీకు చదువు అబ్బకపోతే ఏం? వృద్ధిలోకి రాలే? అంటాడు, పిచ్చివాడు! నా మాటలు నమ్మాడు. నిజంగానే నేను ఓ పెద్ద కాంట్రాక్టరు అనుకుంటున్నాడు. గ్లాస్కో ధోవతీ, సిల్కు లాల్చీ, బిళ్ళ కండువా చూసి మూడు పువ్వులూ ఆరు కాయలుగా ఉన్నది నా జీవితం అన్న భ్రాంతిలో పడ్డాడు. ఇవి అద్దెకు తెచ్చుకున్నవని—పాపం అతని కేం తెలుసు!

ఒక వ్యాపారస్తుడు బియ్యం దొంగ తనంగా మద్రాసుకు రవాణా చేయాలంటే మాట్లాడదామని సెంటరుకు వచ్చాడు. మనిషి ఘరానాగా ఉంటే కాని బేరం సెటిల్ కాదంటేను ఈ డ్రెస్ అద్దెకు తెచ్చి వేసుకున్నాను.

తీరా రెండు గంటల నుంచి సెంటర్లో కాపలా కాసినా ఆ వ్యాపారస్తుడు రాలేదు. బట్టల కిచ్చిన అద్దెకూడా దండగ అయింది.

దిన దిన గండం నూరేళ్ళ ఆయుష్షుగా ఉంది బతుకు. బేరం కుదిరిన రోజున పది రూపాయలు చేతిలో పడతాయి లేని రోజున లేకుండా ఉంది. తెల్లవారి లేచినప్పటి నుంచీ రోజు ఎలా గడుస్తుందా అనే బెంగ! బొత్తిగా మనశ్శాంతి లేకుండా ఉంది.

బంగారయ్య పని మెరుగ్గా ఉంది. నెల తిరిగేసరికి నాలుగు వందల రూపాయలు జీతం చేతిలో పడుతుంది. కుటుంబంలో నీళ్ళు కదలని ఉద్యోగం. పిల్లలు రత్నాలట. భార్య పేరులోనే కాదట నిజంగానే మాణిక్యమట.

* * *

రచయిత:

ఇలా తన సమస్యలు తనకు తోడురాగా నారాయణరావు ఇంటికి చేరాడు.

అలాగే బంగారయ్య ఆలోచనల భారంతో అడుగులో అడుగు వేసు కుంటూ ఇంటికి చేరాడు.

భార్య మాణిక్యమ్మ ఎదురు వచ్చింది. పంచదార తెచ్చారా అని అడగబోయి, ఖాళీ సంచీ చూసి, అంతకంటె వెలితిగా కనిపిస్తున్న బంగారయ్య ముఖం చూసి, 'మంచినీళ్ళు ఇయ్యమంటారా?'' అని అడిగింది.

# భా(వ)స్వరం

సమాజం మనసులో
చెరగని ముద్రగా మిగిలిపోవాలన్నా
ఒక మధుర స్మృతిగా నిలిచిపోవాలన్నా
జీవితం —
మరువలేని మంచి మనిషిగా జీవించాలి
లేదా
తనది నటనని పరులు గ్రహించలేనంత
గొప్ప ఆర్టిస్టుగా ముగించాలి!

— మేకా సుధాకరరావు

వాల్చి ఉన్న మంచం మీద కూర్చుంటూ, ''ఇయ్యి'' అన్నాడు బంగారయ్య.

సెవెన్త్ క్లాస్ చదువుతున్న వాసు— ''నాన్నగారూ! నాకు అర్ధ సంవత్సరం పరీక్షల్లో ఫస్ట్ రాంక్ వచ్చింది. ప్రోగ్రెస్ కార్డ్‌మీద సంతకం పెడతారా?'' అంటూ వచ్చి ప్రోగ్రెస్ కార్డ్ బంగారయ్యకి అందించాడు.

''నేనూ ఫస్ట్ క్లాస్‌లోనే పాసయ్యాను. బతకలేక బడిపంతులు ఉద్యోగం చేస్తున్నా. అన్నయ్య కాలేజీ ఫస్ట్ వచ్చాడు. కాని, వాడికి ఉద్యోగం ఎక్కడ వచ్చింది? నారాయణరావు చూడు—చదువు లేకపోయినా లక్షల మీద కాంట్రాక్టులు చేస్తున్నాడు. కొడుకునీ ఆ లైను లోనే తర్ఫీదు చేస్తున్నాడు. అదీ బతక నేర్చిన తెలివి. ఈ చదువులూ, ఫస్ట్ క్లాసులూ ఏం చేసుకోను? ఎవర్ని ఉద్ధరించను? కడుపు నిండా తిండి ఉండదు, కంటి నిండా నిద్ర ఉండదు, కట్టుకోను గట్టి బట్ట ఉండదు. ఛీ! ఛీ! ఏం ఉద్యోగాలు! ఏం జీవితాలు?''

బంగారయ్య ఆవేశంతో ప్రోగ్రెస్ కార్డ్ చించి పోగులు పెట్టాడు.

బంగారయ్య మాటలు వాసుకు ఏంత మాత్రం అర్థం కాలేదు.

మంచినీళ్ళు తెచ్చిన మాణిక్యమ్మ నిర్ఘాంతపోయి చూస్తూ ఉండిపోయింది. నారాయణరా వెవరో, అతని కొడు కెవరో ఆమెకు అంతు పట్టలేదు.

ఇక్కడ బంగారయ్య ఇంట్లో ఇలా జరిగితే, అక్కడ నారాయణరావు ఇంట్లో ఏం జరిగిందో మీకు చెప్పనక్కర్లా?

ఇంటికి చేరిన నారాయణరావు చేతులు విరిగిన చెక్క కుర్చీలో కూలబడ్డాడు.

తండ్రి రాక కోసం ఎదురు చూస్తున్నాడో ఏమో కొడుకు విఠల్ గబగబా ఒక రిస్ట్ వాచీ తెచ్చి నారాయణరావు చేతిలో పెట్టాడు.

''నాన్నా! ఇది మా స్నేహితు డొకడి దగ్గర వంద రూపాయలకు బేరం చేసి తెచ్చాను. స్మగుల్డ్—రికోవాచ్. ఏ లారీ డ్రైవరో కావాలన్నా డంటి వినా? మార్కెట్టులో అమ్మితే మనకు ఒక ఏభై లాభం ఉంటుంది.''

ఇలా కొడుకు చేత స్మగుల్డ్ వాచీలు తెప్పించి తన ఇలాకాను అమ్మటం అలవాటే నారాయణరావుకు. కాని, ఈ రోజు మాత్రం బంగారయ్యను చూసిన తరవాత, అతని పిల్లల గురించి విన్న తరవాత నారాయణరావుకు ఈ పని నచ్చలేదు.

''ఇటువంటి దౌర్భాగ్యపు పనులు ఇప్పటినుంచే నేర్చుకో. బాగుపడతావు! కష్టపడి చదువుకుని పైకి రావాలి గాని, ఈ దొంగ పనులేమిటి? అబద్ధపు బతుకు లేమిటి? బంగారయ్య కొడుకులు చూడు. ఫస్ట్ క్లాస్‌లో పాసవుతున్నారట. నలుగురిలో సెహభాష్ అనిపించు కుంటున్నారట. నువ్వూ ఉన్నావు... ఎందుకూ! మొహానికి నిప్పు లేకపోతే సరి!''

చేతిలోని వాచీని విసిరి వేశాడు నారాయణరావు.

తండ్రి ఏమిటి ఇలా మాట్లాడు తున్నాడు ఈ రోజు అని బిత్తర చూపులు చూస్తున్నాడు విఠల్.

పెద్దగా అరుస్తున్న నారాయణరావు కేకలు విని భార్య ఇవతలికి వచ్చింది. బంగారయ్య ఎవరో, అతని కొడుకు లెవరో అర్థంకాక నిర్ఘాంతపోతూ నిలబడిపోయింది.